# నేరము శిక్ష

టెలిఫోన్ ఆపరేటర్ రీటా తన డ్యూటీలో బిజీగా వున్నవేళ...
"దయచేసి ఈ ఫోన్ పోలీస్ కమీషనర్ మహదేవ్ మంగేష్కర్‌కు కనెక్ట్ చేయండి"
అంటూ ఓ కంఠం అభ్యర్థించడం వినిపించింది.
"మీ పేరూ....?" అడిగింది రీటా.
"డిసౌజా...అదే ఫిలిప్స్ డిసౌజా... ముందు టైమ్ వేస్ట్ చేయకుండా కమీషనర్‌కి కనెక్ట్ చేయండి..."
అతని కంఠంలో ఆదుర్దా కొట్టొచ్చినట్లు తెలిసిపోతోంది.

# వాడే వీడు...

**ఆదిత్య**

వెంటనే బజర్ నొక్కింది.

ఫోన్ అందుకున్న మహదేవ్, "ఎస్.." అన్నాడు.

"సార్... ఎవరో ఫిలిప్స్ డిసౌజా అట...మీతోనే మాట్లాడాలని ఫోన్‌లో వెయిట్ చేస్తున్నాడు..."

"విషయం ఏమిటో కనుక్కో..."

"అదేదో మీకే చెప్తాడట. సార్..."

ఒక్కక్షణం మహదేవ్ భృకుటి ముడిపడింది. ప్రతిరోజూ ఇలాంటి ఫోన్లు తమ డిపార్ట్‌మెంటుకు రావడం సహజమే! ఏ పుట్టలో ఏ పాముందో? అనుకుంటూ "సరే కనెక్ట్ చేయండి..." స్థిరంగా అన్నాడు మహదేవ్.

"హలో.... ఎవరూ...?" అడిగాడు మహదేవ్.

"సార్...చాలా ముఖ్యమైన సమాచారం మీకు అందించబోతున్నాను. పోతే... నాదో చిన్న విన్నపం..." నసుగుతూ అన్నాడు డిసౌజా.

"ఏంటో త్వరగా చెప్పు.. అవతల చాలా అర్జంట్ పనులున్నాయి..." తొందర చేశారు కమీషనర్.

"మరేం లేదు. గ్యాంగ్ లీడర్ గఫార్‌ఖాన్ ఆచూకీ తెలిపిన వారికి మీరిస్తానన్న యాభైవేల రూపాయల బహుమతి నాకందించాలి...."

"అందులో నిజానిజాలు నిర్ధారించిన తరువాతే కదా బహుమతి ఇచ్చేది...."

"నే చెప్పినదాంట్లో ఏమాత్రం అసత్యం వున్నా మీరే శిక్ష విధించినా అనుభవించడానికి సిద్ధం..."

"ఓకే. ఆ ప్రైజ్ మనీ నీకు అందించే పూచీ నాది..." హామీ ఇచ్చాడు కమీషనర్.

"అయితే నేచెప్పిన అడ్రస్‌కు తక్షణం ఆలస్యం చేయకుండా బయలుదేరండి. కొన్ని కోట్ల రూపాయల విలువ చేసే కొకైన్ చేతులు మారనుంది. ఓల్డ్ గోవాలోని కొండ మీద వున్న పాత చర్చికి వెళ్లండి క్విక్. రేపు ఉదయం కలుస్తాను. చెక్ సిద్ధంగా ఉంచండి.." ఫోన్ కట్ చేసాడు డిసౌజా.

అప్పటికే ఆ కాల్ ఎక్కడ నుంచి వచ్చిందో ఎస్ఐ అజిత్ వాడేకర్ ట్రేస్ చేశాడు. అదో పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి వచ్చిన ఫోన్ అని కమీషనర్‌కు తెలియజేశాడు అజిత్ వాడేకర్.

"ఏం సార్ ఆలోచిస్తున్నారు?" అడిగాడు వాడేకర్.

"వాడు చెప్పినదాంట్లో నిజం ఎంతుందో అని నా అనుమానం.."

"పోనీ ఓ సారి చూసొస్తే సరిపోతుందిగా...."

"అలాగే పద..." అన్నాడు మహదేవ్.

★ ★ ★

ఓల్డ్ గోవా సిటీకి దూరంగా విసిరేసినట్టున్న పాత చర్చికి చేరుకున్నారు కమీషనర్ మహదేవ్, ఎస్ఐ అజిత్ వాడేకర్‌లు.

వాడ కలో లేనందుకేమో పాతగోడలు చెమ్మకు తడిసి వున్నాయి. గబ్బిలాలు నివాసముంటున్నాయేమో ఘాటైన ముతక వాసన. చీకట్లో చెక్క తలుపులు కిర్రుమని తెరుచుకొని సన్నటి వెలుతురు పరుచుకోగానే గబ్బిలాలు టపటపా రెక్కలాడిస్తూ ఎగిరిపోయాయి. టార్చిలైటు వెలిగించి చూశారు. అక్కడ గోడకు ఆనుకొని చెక్క అల్మారాలో అట్ట కార్టన్‌లు వరుసగా పేర్చి వున్నాయి. చేతిలోని స్టిక్‌తో తట్టారు. అవి ఖాళీ పెట్టెలు కావని తెలిసిపోయింది.

"సార్ డిసౌజా చెప్పింది వీటి గురించే అయి వుంటుంది..." అంటూ ఓ కార్టన్ మూత తెరిచాడు అజిత్. ప్లాస్టిక్ కవర్‌లో తెల్లని సుద్దలాంటి పొడి.

"ఓగాడ్... కొకైన్...." ఆశ్చర్యంగా అన్నాడు

మహదేవ్.

"డిసౌజాను అనవసరంగా అనుమానించాం.." అనుకుంటూ ఆ సరుకునంతా జీపుల్లోకి చేర్చారు. మరునాడు డ్రగ్స్ ఎక్స్‌పర్ట్స్ దాన్ని పరీక్షించి అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు పదికోట్లకు పైగా వుంటుందని చెప్పారు.

కమీషనర్ ఫిలిప్స్ డిసౌజాకు యాభైవేల రూపాయల చెక్ తయారు చేయించాడు. సరిగ్గా అప్పుడే ఆపరేటర్ రీటా కమీషనర్‌కు ఫోన్‌లో "సార్... ఎవరో పేరు చెప్పడం లేదు. మిమ్మల్ని అర్జంట్‌గా ఓల్డ్‌గోవాలోని చర్చి దగ్గరకు రమ్మంటున్నారు" అంటూ తెలియజేసింది.

"బహుశా ఫిలిప్స్ డిసౌజా చేసుంటాడు. ఈ చెక్ అక్కడే అతనికి అందిద్దాం..." అంటూ అజిత్ వాడేకర్‌తో కలిసి బయలుదేరాడు కమీషనర్ మహదేవ్ మంగేష్కర్.

నిమిషాల్లో ఓల్డ్‌గోవాలోని పాత చర్చికి చేరుకున్నారు ఇద్దరు. చర్చి మెట్ల పక్కన గోడకు ఆనుకొని ఓ నడివయస్కుడు కూర్చొని వున్నాడు. అతనే డిసౌజా అనుకున్నారు. బహుశా తమ కోసమే ఎదురు చూస్తున్నాడనుకొని గబగబా మెట్లెక్కి అతని దగ్గరకు చేరుకున్నారు.

మహదేవ్ చెయ్యి ముందుకు చాచి "కంగ్రాట్యులేషన్... మిస్టర్ డిసౌజా... నువ్వు యాభైవేలు




గెల్చుకున్నావు." అంటూ అతని చెయ్యి అందుకున్నాడు. అంత పెద్దమనిషి షాక్‌కు గురయ్యాడు. డిసౌజా చెయ్యి చల్లగా మంచులా తాకింది. అజిత్ డిసౌజాను కదిలించేసరికి అమాంతం ముందుకు తూలి పడ్డాడు. డిసౌజా కళ్లు నిస్తేజంగా వున్నాయి. వీపులో కత్తి దిగబడి వుంది. డిసౌజా పిడికిట్లో ఓ కాగితం కనిపించింది.

"ఈ గ్యాంగ్ లీడరును పట్టుకోవడం అంత సులభం కాదు.." అని రాసి వుంది.

ఎరుపు, తెలుపు రంగు చదరపు గళ్లున్న ఓ దళసరి గుడ్డ అతని శరీరానికి చుట్టబడి వుంది. ఆ గుడ్డ చివర్న 'ఆర్.ఆర్' అన్న ఇంగ్లీష్ పొడి అక్షరాలు కనిపించాయి.

డిసౌజా శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపించడంతో పాటు అతని దగ్గర దొరికిన స్లిప్‌ని, అతని ఒంటికి కప్పిన చదరపు గళ్ల క్లాత్‌ని జాగ్రత్త చేశారు.

★ ★ ★

రిమ్‌జిమ్ రెస్టారెంట్‌లో టేబుళ్లన్నీ నిండి వున్నాయి. అదో పేకాటరాయుళ్ల స్వర్గధామం. అక్కడంతా జూదగాళ్లకు ఆటవిడుపుగా వుంది. వీటికి అదనపు ఆకర్షణగా మెరుపు తీగ నీలికళ్ల నైనా క్లబ్ డ్యాన్సర్ అక్కడున్న వాళ్లందరికి తన అందాలతో కనువిందు చేస్తోంది. ఓ మూల సివిల్ డ్రస్‌లో ఎస్ఐ అజిత్ వాడేకర్ కూర్చుని అందర్నీ

గమనిస్తున్నాడు. హోరెత్తించే మ్యూజిక్‌కి అనుగుణంగా హొయలొలికిస్తూ నర్తిస్తోంది నైనా.

ఒంటరిగా వున్న అజిత్ టేబుల్ ముందుకొచ్చి అందాలొలకబోస్తూ ఓ సిగరెట్ నోటికందించి వెలిగించింది. ఆ కొద్దిపాటి సమయంలోనే ఓ పచ్చనోటుతో పాటు నిన్ను కలవాలి అన్న స్లిప్ కూడా అందించాడు అజిత్.

డాన్స్ ముగిసే ముందు అజిత్‌ను రమ్మన్నట్లు సైగ చేసింది నైనా.

అజిత్ వడివడిగా ఆమెను అనుసరించాడు. అతన్ని తన గదిలోకి ఆహ్వానించి గది బోల్ట్ వేసింది.

అతని ఎదురుగా కూర్చుంటూ...

''చెప్పండి మీకేం కావాలి?'' అడిగింది నైనా.

''ఫిలిప్స్ డిసౌజా గురించి వివరాలు చెప్పగలరా....?'' అడిగాడు అజిత్.

డిసౌజా పేరు వినగానే నైనా నీలికళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''ఫిలిప్స్... చాలా మంచివాడు. నేనంటే ప్రేమగా చూసుకునేవాడు....''

''అతనేం చేసేవాడో చెప్పుతావా?''

''అతను గోల్డన్ ఫార్మాస్యూటికల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవాడు. ఆ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ఫెర్నాండెజ్‌కు అన్ని విషయాల్లో కుడిభుజంలా వ్యవహరించేవాడు. ఈ మధ్యే ఎందుకో అతనితో గొడవపడ్డాడు. నాతో కూడా ఇంక త్వరలో ఆ కంపెనీ నుంచి విడిపోతానని, తనకు డబ్బు రానుందని, ఇద్దరం కలిసి ముంబాయి వెళ్లిపోయి స్థిరపడదామన్నాడని...'' చెప్పింది నైనా.

ఇంకా ఏదో చెప్పబోయింది. ఇంతలో గది బయట ఎవరో తచ్చాడుతున్నట్లనిపించి నోటి మీద వేలేసుకొని ''రేపు ఉదయం నా అపార్ట్‌మెంట్‌కు రండి...'' అంటూ ఓ కార్డ్ ఇచ్చింది.

'సరే' అంటూ అక్కడి నుంచి బయలుదేరుతుంటే హోటల్ టేబుళ్ల పైన పరిచి వున్న ఎరుపు, తెలుపు రంగులున్న చదరపు గళ్ల గుడ్డ అతడిని ఆకర్షించింది. ఆ టేబుల్ క్లాత్ చివర 'ఆర్. ఆర్' అన్న ఇంగ్లీష్ పొడి అక్షరాలను గమనించాడు. అలాంటి గుడ్డే ఫిలిప్స్ కళేబరానికి చుట్టబడి వుండడం గుర్తొచ్చింది అతనికి.

★ ★ ★

ఆ రాత్రే పోండాలోని 'గోల్డన్ ఫార్మాస్యూటికల్స్' ఆవరణకు చేరుకున్నాడు అజిత్ వాడేకర్. ఊరి చివర వుండడం వల్ల అక్కడ జనసంచారం లేదు. ఆరోజు ఆదివారం అవడం కూడా మరో కారణం. దొడ్డిదారి గుండా బిల్డింగ్ ఆవరణలోకి ప్రవేశించాడు ఎస్ఐ అజిత్ వాడేకర్. అక్కడ హాల్లో పెద్ద పెద్ద మిషిన్లు వున్నాయి. దాన్ని ఆనుకొని వున్న గదుల్లో అట్టపెట్టెలు పేర్చి వున్నాయి.

వాటిల్లోని సీసాల్లో క్యాప్సుల్స్ వున్నాయి. ఓ క్యాప్సుల్ చేతిలోకి తీసుకొని దాన్ని రెండుగా విడదీశాడు. అందులో నుంచి తెల్లపొడర్ చేతిలో పడింది. మందు ముసుగులో ఉన్న కొకైన్ క్యాప్సుల్ అది. అతనికి విషయం చాలా వరకు అర్థమయింది. ఆ ఫ్యాక్టరీ పేరుకే మందుల కంపెనీ కాని అక్కడ నుంచి సప్లయ్ అయ్యేది క్యాప్సుల్స్‌లో కొకైన్. అంటే మాఫియా గ్యాంగ్ లీడర్ గఫార్‌ఖాన్ స్థావరం ఇదే అని రూఢీ అయింది. సెల్ ఆన్ చేసి కమీషనర్ మహదేవ్‌కి గోల్డన్ ఫార్మాస్యూటికల్స్ విషయం తెలియజేసాడు అజిత్.

''గుడ్... ఆ స్థావరంపై దాడి చేయమంటావా..?'' అడిగాడు కమీషనర్.

''అసలు వ్యక్తి దొరికే వరకు కొంచెం ఓపిక పట్టాలి సార్..''

''ఓకే అలాగే కానీ....'' అన్నాడు మహదేవ్.

★ ★ ★

డోనాపాల్ దగ్గర్లో వున్న నైనా ఫ్లాట్‌కి వెళ్లాడు అజిత్‌వాడేకర్. తలుపు దగ్గరకు వేసి వుంది. చేత్తో అలా తట్టగానే కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది. హాలంతా చీకటిగా వుంది. గోడ తడుముకుంటూ స్విచ్ ఆన్ చేసాడు. భళ్లున వెలుతురు హాలు నిండా పరుచుకుంది. పక్కనే వున్న బెడ్‌రూమ్‌లోకి తొంగి చూసాడు. నేలపై పడి వుంది నైనా. ఒక్క అంగలో నైనాను చేరాడు అజిత్.

నైనా నిర్జీవ శరీరం కింద ఎర్రటి రక్తం మడుగు కట్టి ఉంది. తెల్లటి ఫ్లోర్ మీద నైనా తన రక్తంతో 'ఎఫ్–జి' అన్న ఇంగ్లీషు అక్షరాలు రాసి కన్నుమూసింది. క్షణాల్లో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నైనా శవాన్ని పోస్టుమార్టంకు పంపారు. నైనా వీపులో దిగిన కత్తిమీద వేలిముద్రలు సేకరించారు. అంతకు ముందు జరిగిన ఫిలిప్స్ డిసౌజా హత్యకు ఉపయోగించిన కత్తిమీద వేలిముద్రలు ఒక్కటే అని రుజువయ్యాయి.

అలాగే ఓల్డ్‌గోవాలోని పాత చర్చి, రిమ్‌జిమ్ రెస్టారెంట్ బార్, గోల్డన్ ఫార్మాస్యూటికల్స్‌కు ఏదో సంబంధం వుందనిపించింది. అదే విషయం కమీషనర్‌కు తెలియజేసాడు.

★ ★ ★

నైనా శవపేటిక వద్ద పుష్పగుచ్ఛం వుంచి కళ్లు మూసుకొని నిల్చొని వున్నాడు. గోల్డెన్ ఫార్మాస్యూటికల్స్ డైరెక్టర్ ఫెర్నాండెజ్. దీర్ఘంగా శ్వాస విడుస్తూ ఎంతో మంచి అమ్మాయి... ఏ దుర్మార్గుడు పొట్టన పెట్టుకున్నాడో.. అని పైకి అనుకుంటూ వెనక్కి తిరిగాడు ఫెర్నాండెజ్.

తన వెనుకనే రివాల్వర్ తన వైపు గురిపెట్టి నిల్చున్న కమీషనర్ మహదేవ్, ఎస్ఐ అజిత్‌లను చూసి ఆశ్చర్యపోతూ..

''ఏమిటిదంతా..?'' అంటూ అడిగాడు ఫెర్నాండజ్.

''ఇంకేరీ అంతలా నటించనక్కర్లేదు మిస్టర్ ఫెర్నాండెజ్ ఉరఫ్ గఫార్ ఖాన్..'' మహదేవ్ నోటి వెంట వెలువడ్డ తూటాల్లాటి మాటలు వింటూనే

''మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు...'' అన్నాడు ఫెర్నాండెజ్.

''అర్థమయ్యేలా చెబుతా విను...'' అంటూ అజిత్ చెప్పడం ప్రారంభించాడు.

''ఈ సమాజంలో గౌరవప్రదంగా మెలగడానికి ఓ మందుల కంపెనీ పెట్టి దాని డైరెక్టర్ ఫెర్నాండెజ్‌గా అవతారం ఎత్తావు. ఆ కంపెనీలో కోకైన్ కాప్సుల్స్ తయారుచేసి గ్యాంగ్ లీడర్ గఫార్‌ఖాన్‌గా నీ వ్యాపారం సాగిస్తున్నావు. ఈ విషయం చెబుతాడని నీతో విభేదించిన డిసౌజాను హతమార్చావు. ఇప్పుడు నైనాను అంతమొందించావు. ఈ రెండు శవాల దగ్గర వేలిముద్రలు దొరికాయి. చనిపోతూ నైనా 'ఎఫ్–జి' అని రాసింది. అంటే ఫెర్నాండెజ్ గ్యాంగ్ లీడర్ గఫార్‌ఖాన్ అని.. ఈ సాక్ష్యం చాలా..'' అంటూ చెప్పడం పూర్తిచేశాడు అజిత్.

అప్పటికే పోలీసులు అతన్ని చుట్టుముట్టడంతో మారు మాట్లాడకుండా లొంగిపోయాడు ఫెర్నాండెజ్.

కేసు విచారణలో వుంది.

★

